క్లుప్తంగా

తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సు సర్వీసులు

మదనపల్లె సిటీ: గురుపౌర్ణమి పురస్కరించుకుని తిరువణ్ణామలైకి జులై 2,3 తేదీల్లో ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ టు డిపో మేనేజర్ ఆర్‌సి నిరంజన్ తెలిపారు. బస్సు టైమింగ్ ప్రకారం బయలుదేరుతాయన్నారు. భక్తులు ముందుగానే బస్టాండుకు చేరుకోవాలన్నారు. రిజర్వేషన్ కోసం 9959225677, 9160186645ను సంప్రదించాలని కోరారు.

ఎంపీడీఓగా సురేంద్రనాథ్



తంబళ్లపల్లె: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా సురేంద్రనాథ్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో శ్రీకాళహస్తి ఎంపీడీఓగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఏఓగా పనిచేసిన ఆనంద్‌కుమార్ ఇన్ని రోజులు ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు

ఇన్‌చార్జి ఏపీపీగా రఫీ అన్సారీ

పీలేరు : పట్టణ 11వ అదనపు జిల్లా జడ్జి కోర్టు ఇన్‌చార్జి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రఫీ అన్సారీని నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన పీలేరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో పీపీగా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం 11వ అదనపు జిల్లా జడ్జి కోర్టు ఇన్‌చార్జి పీపీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ముస్లిం మైనారిటీ నాయకులు అబ్దుల్ ఖలీమ్, జాకీర్‌హుస్సేన్ దుశ్శాలువతో ఆయన్ను సత్కరించారు.

పేదలకు ఉచితంగా ప్రభుత్వ సేవలు

పెద్దతిప్పసముద్రం: పేదలకు ఉచితంగా ప్రభుత్వ సేవలు అందించడం కోసం జగనన్న సురక్ష ప్రారంభించినట్లు సచివాలయ మండల కన్వీనర్ డ్రిప్ రమణ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని టి సదుం సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై గృహ సారథులు, వలంటీర్లు, గ్రామ కన్వీనర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రమణ మాట్లాడుతూ అర్హత ఉన్న ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా ఉండాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి ఇంటింటికీ వెళ్ళి వివరాలు నమోదు చేయాల్సిన బాధ్యత వలంటీర్లదే అన్నారు. సర్పంచ్ శారద, ఉప సర్పంచ్ పీఎస్ మధు, ఎంపీటీసీ జయలలిత, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

లబ్ధిదారులకు ప్లాట్ల కేటాయింపు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులో పక్కా గృహాలు మంజూరై సొంత స్థలాలు లేని లబ్ధిదారులకు బుధవారం జగనన్న లేఅవుట్‌లో ప్లాట్లను కేటాయించారు. ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, ఎంపీటీసీ కేశవ్, సర్పంచ్ రహ్మతుల్లా, కన్వీనర్ సుబ్బరాంల సమక్షంలో తహసీల్దార్ విద్యాసాగర్, ఆర్‌ఐ అనీషా, వీఆర్వో శ్రీరాములు 52 మందికి లాటరీ పద్ధతిలో ప్లాట్లను కేటాయించారు. అయితే తాము కూడా పక్కా గృహాల మంజూరుకు అర్హులమేనని, సొంత స్థలాలు లేవని పలువురు అధికారులను ప్రశ్నించగా దరఖాస్తు చేసుకుంటే అర్హులందరికీ స్థలాలు కేటాయిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

హుండీ ఆదాయం లెక్కింపు

నిమ్మనపల్లె : మండలంలోని తవళం నేలమల్లేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కించగా రూ.83వేల ఆదాయం వచ్చినట్లు ఈఓ మంజుల తెలిపారు. బుధవారం దేవదాయశాఖ అధికారి రవికిరణ్‌కుమార్‌రెడ్డి, ఈఓ మంజుల పర్యవేక్షణలో నాలుగునెలల కాలానికి ఆలయ హుండీ ఆదాయాన్ని తాత్కాలిక కమిటీ సభ్యులు లెక్కించారు. హుండీ ఆదాయాన్ని వాల్మీకిపురం ఇండియన్ బ్యాంక్‌లో జమచేసి, ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. ఆలయంలో పెంచిన ఆర్జితసేవా టిక్కెట్ల ధరలు జూలై 1 నుంచి అమల్లోకి వస్తాయన్నారు. ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, రవీంద్ర, చిన్నరెడ్డెప్ప, ఆలయ అర్చకులు శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

పీటీఎంలో పోలీసుల కవాతు

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలో బుధవారం ఎస్‌ఐ రవీంద్రబాబు ఆధ్వర్యంలో 50 మంది పోలీసులు కవాతు నిర్వహించారు. గురువారం జరగబోవు బక్రీద్ పండుగను శాంతియుతంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ ముస్లిం సోదరులకు సూచించారు.

గోవధ నిషేధం

తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీఓ గిరిధర్ రెడ్డి, ఎస్‌ఐ రవీంద్రబాబులు స్థానికంగా ఉండే ప్రజా ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలతో సమీక్షించారు. భక్తి శ్రద్ధలతో జరుపుకునే బక్రీద్ పండుగలో గోవధను నిషేధించామని ఇందుకు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కేవీపల్లె : మండలంలోని నూతనకాల్వ పంచాయతీ సీకేఆర్‌పల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఘన సన్మానం లభించింది. బుధవారం సీకేఆర్‌పల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో బదిలీ అయిన ఉపాధ్యాయులు ఇంద్రాణి, జయరామ్‌నాయక్, మల్లికార్జునలను ఉపాధ్యాయులు, విద్యార్థులు దుశ్శాలువలు, పూల మాలలతో సత్కరించారు.

ఆరోగ్యమస్తు



మదనపల్లె మండలంలో...

104 వాహనాలు:	2
సిబ్బంది	6
104 వాహనాలు:	2
రోజు సగటు పరీక్షలు చేసుకుంటున్న వారు	200

ఫ్యామిలీ డాక్టర్‌తో గ్రామీణులకు అత్యుత్తమ వైద్యం



శాంతమ్మ ఇంటి వద్దనే వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మదనపల్లె సిటీ: ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోంది. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత కల్పించింది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామాల్లో ప్రజల వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నారు. దీంతో ఖర్చులు, ఇబ్బందులు తప్పాయని గ్రామీణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంచానికి పరిమితమైన వృద్ధులు,వికలాంగులు, ఆరోగ్యశ్రీ రోగులను పరామర్శిస్తూ ఇంటి వద్దనే సేవలు అందిస్తున్నారు. 14 రకాల పరీక్షలు, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. దీంతో పాటు మధ్యాహ్నం ఆయా గ్రామాల్లోని అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.



నా పేరు బి.నరసింహులు. వయస్సు 76. మదనపల్లె మండలం జంగాలపల్లె. కాళ్లనొప్పులు, ఆయాసంతో బాధపడుతున్నా. మదనపల్లెలోని ఆస్పత్రులకు వెళ్లాలంటే కష్టం. వయస్సు మీరడంతో దూరంగా వెళ్లి ఆస్పత్రులకు చూపించుకోవాలంటే ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు 104 వాహనం నెలకు రెండు సార్లు వస్తోంది. డాక్టరే స్వయంగా చూస్తున్నారు.

ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల నిధులు

– రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



ప్రజలు సమస్యలను తెలుసుకొంటున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల

గుర్రంకొండ: జిల్లాలోని ప్రతి సచివాలయానికి రూ. 20 లక్షల అభివృద్ధి నిధులు మంజూరు చేస్తామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి అన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. బుధవారం మండలంలోని నడిమికండ్రిగ పంచాయతీలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలపై స్పందించి అప్పటికప్పుడు పరిష్కారం చూపించారు. నడిమికండ్రిగ గ్రామంలో నెలకొన్న సమస్యలన్ని పరిష్కరిస్తామని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హామీ ఇచ్చారు. ప్యారంపల్లె దళిత వాడలో పక్కనున్న దొమ్మరాతి చెరువు మొరవ నీరు వస్తే ఇళ్లలో నీరు చేరుతోందని మహిళలు ఫిర్యాదు చేశారు. మొరవ నీరు రాకుండా రక్షణ గోడ నిర్మించాలని వారు కొరారు. స్పందించిన ఎంపీ అప్పకప్పుడే రూ. లక్ష నిధులు మంజూరు చేశారు. దళిత వాడలో మాతమ్మతల్లి ఆలయ నిర్మాణానికి రూ. 50 వేలు మంజూరు చేశారు. పార్యంపల్లెలో తాగునీరు సరఫరా కావడం లేదని వీధుల్లో తాగునీటి పైపు లైన్లు ఏర్పాటు చేయాలని మహిళలు కోరారు. స్పందించిన ఎంపీ తాగునీటి పైపులైన్ల ఏర్పాటు కోసం రూ. 4లక్షల నిధులు మంజూరు చేశారు. ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సప్రీన్ ముక్తియార్, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి,మండల సచివాలయాల కన్వీనర్ చింతిర్ల నాగేంద్రర్మేపీ రెడ్డి సంఘం గౌరవాధ్యక్షులు నారదరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్‌లు ప్రకాష్‌రెడ్డి, వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్, మాజీ సింగిల్‌విండో ఛైర్మెన్ వెంకటశివారెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, వైస్ఎంపీపీ కరుణాకర్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బలవన్మరణాలు సమస్యలకు పరిష్కారం కాదు

- ప్రతి సమస్యకు పరిష్కారముంటుంది
- మానసిక సమస్యల కౌన్సెలింగ్‌కు టెలిమానస్ టోల్ ఫ్రీనంబర్ 14416

–ఎమ్మెల్యే నవాజ్‌బాషా



జిల్లా ఆస్పత్రిలో టెలిమానస్ బ్రోచర్స్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : ఎంత పెద్ద సమస్యకైనా పరిష్కారముంటుందన్న విషయం గుర్తిస్తే బలవన్మరణాలు నిరోధించవచ్చని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా టెలిమానస్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రతి సమస్యకు పరిష్కార మార్గం ఉంటుందన్నారు. ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, తీవ్ర భయాందోళనలు, మాదకద్రవ్య దుర్వినియోగం, ఆత్మహత్య ఆలోచనలు, మానసిక సమస్యలతో ఉన్నవారు ఎవరైనా ఈ టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించడం ద్వారా విలువైన సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న వారు 14416 టోల్ ఫ్రీ నెంబర్‌కి కాల్ చేసి తమ సమస్యలను తెలిపితే మానసిక వైద్యనిపుణులు సమస్యకు సరైన పరిష్కార మార్గాన్ని సూచిస్తారన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి మాట్లాడుతూ.. మానసిక సమస్యలతో బాధపడుతున్నవారికి అండగా నిలిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త ఆధ్వర్యంలో టెలిమానస్ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, నూర్‌ఆజం, జిల్లా ఆస్పత్రి సైక్రియాటిస్ట్ వైద్యులు ఉదయ్‌కిరణ్, ఆర్ఎంఓ ప్రసాదరాజు, కౌన్సిలర్ వసీం తదితరులు పాల్గొన్నారు.

అర్హులను గుర్తించడమే 'జగనన్న సురక్ష' లక్ష్యం



జగనన్న సురక్షపై అంగళ్లులో సూచనలిస్తున్న ఆర్డీఓ మురళి

కురబలకోట: అర్హులను గుర్తించి ప్రభుత్వ పథకాలు వర్తింపజేయడమే జగనన్న సురక్ష లక్ష్యమని మదనపల్లె ఆర్డీఓ మురళి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. బుధవారం ఆయన మండలంలోని అంగళ్లులో సర్వే కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి అర్హత ఉండి పథకాలు అందని వారిని గుర్తించాలన్నారు. స్థానికుల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమాన్ని ప్రజలు కూడా వినియోగించుకోవాలన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కీలకంగా పని చేయాలన్నారు. నెల రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కుల, ఆదాయ, జనన, మరణ సర్టిఫికెట్లతో పాటు మ్యూటేషన్, టైటిల్ డీడ్, పట్టాదారు పుస్తకం, వివాహ సర్టిఫికెట్, కుటుంబ సభ్యుల సర్టిఫికెట్, ఆధార్ కార్డుకు మొబైల్ నెంబర్ లింక్, కౌలు రైతుల కార్డు, కొత్త రేషన్ కార్డులు, హౌస్ హోల్డ్ స్ప్లిట్ సర్వీసులను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఎంపీపీ బి. దస్తగిరి, తహశీల్దారు ఎం. భీమేశ్వరావు, ఎంపీడీఓ దిలీప్‌నాయక్, కార్యదర్శి ఎంటీజీ ప్రసాద్, ఆర్‌సి ఈశ్వర్‌రెడ్డి, శేఖర్, ఖాన్, రాజేష్‌రెడ్డి, శ్రీహరి, భారతి, పృథ్వీ పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైఎస్సార్‌క్రాంతిపథం సీసీలు,సంఘమిత్రలు భాగస్వాములు కావాలని ఏపీయం గంగాధర్ తెలిపారు. బుధవారం స్త్రీ శక్తి భవన్‌లో సంఘమిత్రలతో సమావేశం నిర్వహించారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం



భూమి పూజ కార్యక్రమంలో ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందామని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మంచూరులోని శ్రీ క్రిష్ణదేవరాయల కాలం నాటి బాహుదా నది తీరాన వెలసిన శ్రీ సోమేశ్వర స్వామి ఆలయం జీర్ణోద్ధరణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం వారి శ్రీవాణి ట్రస్టు నుంచి రూ.కోటి మంజూరైన నిధులతో ఆలయ జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఎళ్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. ఇలాంటి నాయకులకు ప్రజలు కాపాడుకుంటే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మంచూరు గ్రామంలో ఆలయ నిర్మాణానికి ముస్లింలు స్థలాలను దానం చేసి మత సామరస్యాన్ని చాటు కోవడం అభినందనీయమన్నారు. వాల్మీకిపురం మండలం తనకు సదుం మండలంతో సమానమన్నారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్న ఎంపీ మిథున్ రెడ్డిని ప్రజలు ఎప్పటికీ విస్మరించరాదన్నారు. అనంతరం మండలంలోని చింతపర్తికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు లక్ష్మీనారాయణ రెడ్డి తల్లి కోటపల్లి సరోజమ్మ ఇటీవల మృతి చెందడంతో లక్ష్మీనారాయణ రెడ్డిని పరామర్శించి, సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్, టీటీడీ పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, జెడ్పీటీసీ నిర్మల, నాయకులు నల్లారి తిమ్మారెడ్డి, సహదేవరెడ్డి, రమేష్ బాబు, చింతల శివానంద రెడ్డి, చింతల సాయిక్రిష్టారెడ్డి, అబ్దుల్ కలీమ్, జింక చలపతి, నీళ్లభాస్కర్, గజ్జల శీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ. 230 కోట్లతో అభివృద్ధి పనులు

బి.కొత్తకోట: మండలంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి సహకారంతో రూ. 230కోట్లతో పలు అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు జరిగాయని ఎంపీడీఓ శంకరయ్య అన్నారు. ఎంపీపీ లక్ష్మీ నరసమ్మ అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో తారు రోడ్లు, తాగునీరు, సీసీ రోడ్లు, జలజీవన్ మిషన్, సచివాలయ, ఆర్బీకె, వెల్‌నెస్ భవనాలు, నవరత్నాలు తదితర పథకాల కింద అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ దేశంలోనే ఇంత వరకు జగనన్న సురక్ష లాంటి కార్యక్రమం జరగలేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రామచంద్ర, సింగిల్ విండో చైర్మన్ అమరనాథ్, వైస్ ఎంపీపీ ఖాదర్‌వల్లి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

వైభవంగా సల్లాపురమ్మ జాతర

కలికిరి: మండలంలోని పత్తేగడ గ్రామం కొటాలలో వెలసిన సల్లాపురమ్మ ఆలయ వార్షిక జాతర బుధవారం వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం కనుపండువగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు హాజరై కల్యాణోత్సవం తిలకించారు. అనంతరం ఉత్సవ మూర్తులను గ్రామోత్సవం నిర్వహించారు.

ఈద్గా స్థలం పరిశీలన

పీలేరు రూరల్ : బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని ఈద్గా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనారిటీ సోదరులు శాంతియుతంగా ఈద్గా వద్దకు చేరుకుని ప్రశాంత వాతావరణంలో ప్రార్థనలు చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

నిమ్మనపల్లె : సమస్యల పరిష్కారానికి, సంక్షేమ పథకాల అమలుతీరుకు తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. బుధవారం మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లె, చీనేపల్లె, ఎద్దులవారిపల్లె, చలిమామిడిహరిజనవాడ, జంగంవారిపల్లె, బాలేపల్లె, పూజారి ఇండ్లు తదితర గ్రామాల్లో సర్పంచ్ ఎస్.రెడ్డెమ్మ, నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, కొమ్మేపల్లెశ్రీనివాసులురెడ్డిలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. , ఈ సందర్భంగా స్థానికులు గ్రామాల్లో సిమెంట్‌రోడ్లు, మురుగునీటికాలువలు, తాగునీటి కొళాయిల ఏర్పాటు, సాధారణ, వికలాంగుల పింఛన్లు, రేషన్‌కార్డుల మంజూరు, రెవెన్యూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యుగంధరరెడ్డి, శశిధరరెడ్డి, చంద్రారెడ్డి, హరిబాబు, శంకర, రమణ, లక్ష్మీ వెంకటరెడ్డి, ఎంపీడీఓ శేషగిరిరావు, తహసీల్దార్ సీ.ఆర్.మంజుల తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ పథకాల పంట



గడప గడపకు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు రూరల్ : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త ఆలోచనలతో ప్రతి ఇంటా సంక్షేమ పథకాల పంట పండుతోందని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని బాపూజీనగర్, ప్రశాంత్‌నగర్, మోడల్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుంటూ తమ పరిధిలో ఉన్న సమస్యలు సత్వరమే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగు సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. జగనన్న పథకాలు దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువ పారిశ్రామిక వేత్త జి.వి. రాకేష్ రెడ్డి, ఎంపీపీ సతీష్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు నరేంద్రరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, నాగభూషణం, సాంబశివారెడ్డి, హబీబ్‌బాషా, గ్రామ్‌ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ నిర్మాణానికి స్థల పరిశీలన

మదనపల్లె : పట్టణం మీదుగా వెళుతున్న ఎన్‌హెచ్-42, ఎన్‌హెచ్-71 రహదారులకు సంబంధించి అనుసంధానం చేసేలా తట్టివారిపల్లె వెంగమాంబసర్కిల్‌లో నిర్మించేందుకు ప్రతిపాదించిన ఫ్లై ఓవర్‌కు బుధవారం జేసీ ఫర్మాన్ అహ్మద్ స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్ షేక్‌మహబూబ్‌చాంద్, సర్వేయర్ సుబ్రహ్మణ్యంతో కలిసి వెంగమాంబసర్కిల్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణానికి భూసేకరణలో భాగంగా బసినికొండ, బీకే.పల్లె, వెంకప్పకోట పంచాయతీలకు చెందిన ఎన్‌హెచ్‌కు అనుకుని ఉన్న భూరికార్డులను, మ్యాపులను పరిశీలించారు. రెవెన్యూ అధికారులకు పలుసూచనలు చేశారు.

భూసేకరణ రికార్డులు త్వరితగతిన పంపించండి

పీలేరు : జాతీయ రహదారి 71 విస్తరణ పనుల్లో భాగంగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ రికార్డులు త్వరితగతిన సేకరించి పంపాలని రెవెన్యూ సిబ్బందిని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఆదేశించారు. బుధవారం మండలంలోని బోడుమల్లువారిపల్లె, వేపులబైలు, గూడరేవుపల్లె, పీలేరు గ్రామ పంచాయతీల పరిధిలో భూసేకరణ సర్వే పరిశీలించారు.

అభివృద్ధి పథం.. ముస్లింలకు వరం



ముస్లిం మైనారిటీ నాయకులతో మసీదుల అభివృద్ధిపై చర్చిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల (ఫైల్)

పీలేరు : దివంగత నేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ముస్లిం మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి వారి అభివృద్ధికి యనలేని కృషి చేశారు. తండ్రికి తగ్గ తనయుడుగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేశారు. పీలేరు నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీ అభివృద్ధికి విరివిగా నిధులు మంజూరు చేశారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహమద్ ప్రత్యేక చొరవ చూపడంలో నియోజకవర్గంలోని పలు మసీదులు, ఈద్గాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి.

నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు ఇలా..

- పీలేరు పట్టణంలో ముస్లింల జనాభా అధికంగా ఉండడంతో జనాభాకు తగినట్లు స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలో నూతనంగా షాదీమహల్ నిర్మాణానికి సుమారు రూ. 10 కోట్ల విలువైన రెండెకరాల స్థలాన్ని కేటాయించారు. షాదీమహల్ నిర్మాణానికి రూ. 2 కోట్లతో ప్రతిపాదనలు చేశారు.
- పీలేరు పట్టణం మదనపల్లె రోడ్డులో ముస్లింల ప్రార్థనల కోసం ముందు ఉన్న ఈద్గా స్థలంకు అదనంగా రూ. 10 కోట్ల విలువైన ఓ ఎకరం స్థలాన్ని కేటాయించారు.
- పీలేరులో ముస్లింలకు ప్రత్యేకంగా స్మశాన వాటికకు స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలో స్థలం కేటాయించడంతోపాటు రూ. 10 లక్షలు అభివృద్ధి చేశారు.
- యల్లమంద క్రాస్‌లో మసీదు అభివృద్ధికి రూ. 5 లక్షలు, ఆక్షా మసీదు అభివృద్ధికి, సైనిక్ నగర్‌లో మసీదుకు రూ. 2 లక్షలు, క్రాస్ రోడ్డులో కౌసర్ మసీదుకు రూ. 2 లక్షలు కేటాయించడం జరిగింది.
- పీలేరు పట్టణంలోని మసీదులకు గ్రామ పంచాయతీ ద్వారా తాగునీటి బోర్లు, మోటార్లు ఏర్పాటు చేశారు.
- కలికిరి మండలంలో నూరాని మసీదుకు రూ. 3 లక్షలు, జామియా మసీదుకు రూ. 5 లక్షలు, మదీనా మసీదుకు రూ. 5 లక్షలు, మక్కా మసీదుకు రూ. 4 లక్షలు, కలికిరి మసీదుకు రూ. 5 లక్షలు, ఉమర్ మసీదుకు రూ. 4 లక్షలు, మహమ్మదీయ మసీదుకు రూ. 4 లక్షలు, నూరాని మసీదుకు రూ. 3 లక్షలు, సరా మసీదుకు రూ. 3 లక్షలు మంజూరయ్యాయి.
- కలికిరి మండలంలోని మదరసాకు రూ. 5 లక్షలు, నూతనంగా ఈద్గా నిర్మాణానికి ఎంపీ మిథున్‌రెడ్డి సొంత నిధులు రూ. 14 లక్షలు వెచ్చించి స్థలాన్ని కొనుగోలు చేసి ఇచ్చారు.
- కలికిరిలో రూ. 5 లక్షలతో ఈద్గా నిర్మాణం పూర్తి అయింది.
- కలికిరిలో కొత్తగా నిర్మిస్తున్న మదీనా మసీదుకు రూ. 1.50 లక్షలు, ఉమర్ మసీదుకు రూ. 1 లక్ష ఎంపీ మిథున్‌రెడ్డి సొంత నిధులు ఇవ్వడం జరిగింది. వాల్మీకిపురం అబుబకర్ మసీదు అభివృద్ధికి రూ. 5 లక్షలు నిధులు మంజూరయ్యాయి.

ఎంపీ సేవలు అమోఘం



ముస్లిం మైనారిటీ అభివృద్ధి పెద్దిరెడ్డి, చింతల కుటుంబాలు చేసిన సేవలు అమోఘం. ఈ రెండు కుటుంబాలు దశాబ్దకాలంగా ఉమ్మడి జిల్లాలోని ముస్లిం కుటుంబాలను తమ కుటుంబ సభ్యులతో సమంగా ఆదరించి చేయూతనిస్తున్నారు. ఎక్కడాలేని విధంగా ముస్లింల సంక్షేమానికి నిధులు కేటాయించడం హర్షణీయం.

- అబ్దుల్ ఖలీమ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్

పదవుల్లోనూ ప్రాధాన్యత



జగనన్న ప్రభుత్వంలో రాజకీయంగా ముస్లిం మైనారిటీలకు అనేక పదవులు కల్పించి ప్రాధాన్యతనిచ్చారు. పీలేరు నియోజకవర్గంలో మసీదులు, మదరసాలు, ఈద్గాల అభివృద్ధికి లక్షలాదిగా నిధులు మంజూరు కావడానికి సహకరించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలకు అద్యాంతం రుణపడి ఉంటాం.

- డాక్టర్ హబీబ్‌బాషా, సర్పంచ్, పీలేరు